# 'ఫ్రీ' ఆంజనేయం

-కె.కె.రఘునందన

'ఫ్రీ'గా వస్తే ఫినాయిలు తాగుతారా ఎవరయినా అంటే అది ఉత్తిమాటే నని ఆచరించేవారుంటారా అని విస్తుబోవచ్చుగాని, ఆంజనేయులి విషయానికొస్తే మాత్రం అది కరక్టేనని చెప్పుకోవచ్చునంటే అతిశయోక్తి కాదేమో! ఆంజనేయులు సాదాసీదా గుమాస్తాగిరీ వెలగబెడుతున్నాడు. ఈమధ్యకాలంలో మీడియా ప్రభావం జాస్తిగా అతనిమీద పడింది. అది నరనరాల్లో జీర్ణించుకుపోయింది.

సబ్బులకి సబ్బులు..పేస్టులకి పేస్టులు..బామ్‌కి బామ్.. టీ.వి.కి టీ.వి...ఇలా ఎన్నెన్నో ఫ్రీల ఆఫర్‌లు చూసిన తరువాత ఈ ఫీవర్ షురూ అయింది. చూసిందల్లా కొనేయటం మొదలెట్టాడు. తనకు తలనొప్పి లేకున్నాసరే ఒక ప్లస్ బామ్‌కి మరో ప్లస్ బామ్ 'ఫ్రీ' అంటే అది తెచ్చేశాడోసారి. దాన్ని రాసుకున్న ఆంజనేయులి బామ్మ మహాదేవమ్మ తన కణతలు మంటెత్తి పోతున్నాయని చెప్పి- "ఓర్నాయనోయ్! నీకిదేం పోయేకాలంరా? ఎప్పుడూ తెచ్చే అమృతాంజనం మానేసి ఈ వెధవ ముద్ద కొనుక్కొచ్చావు..!'' అంటూ గగ్గోలెట్టేసింది.

'ఫ్రీ' మాట దేవుడెరుగుగాని, బామ్మను మరల మామూలుగా చేయడానికి తలప్రాణం తోకకి వచ్చింది. అది మొదలు మహదేవమ్మ, ఆంజనేయులితో మాటలు బంద్ చేసేసింది.

అదే సమయంలో తలవని తలంపుగా ఆంజనేయులికి ఒక 'ఫ్రీ' ఆఫర్ దొరికింది. అదేమంటే ఈమధ్యకాలంలో సిన్మా హాళ్ళ దగ్గర జనాలు అతి పలచబడ్డం మూలంగా థియేటర్ల నడుమ తీవ్రమైన పోటీ ఎదురయింది. దాంతో విదర్భ డి.టి.యస్ థియేటర్‌వారు ఒక సినిమా చూసిన వారికి మరో సినిమా ఫ్రీ అంటూ ప్రచారం మొదలెట్టారు. అది చూడ్డంతోటే ఆంజనేయులికి తటాలున ఓ విషయం స్ఫురించింది.

ప్రస్తుతం ఆడుతున్న 'భరతం పడతా' సిన్మా తను చూసేసి వాళ్ళు 'ఫ్రీ' పేరుతో చూపించబోయే 'సతీ సక్కుబాయి' చూపిస్తే తెగ పొంగిపోయి మూగనోము విడనాడుతుంది బామ్మ.

పై పథకం ప్రకారం 'భరతం పడతా'ను ఆంజనేయులు చూసేశాడు. ఫైట్స్, డ్యూయెట్స్‌లో తలంతా దిమ్మెత్తి పోయిందన్నది వేరే సంగతి.

తరువాత 'సతీ సక్కుబాయి' సంగతి బామ్మ మహదేవమ్మ చెవిలో ఊదేసరికి తెగ ఉబ్బిపోయింది. "ఏమిట్రా! సతీసక్కుబాయి మళ్ళా వచ్చిందా? నా పెళ్ళప్పుడు చూశాన్రా ఆ సిన్మాని..మా గొప్ప సిన్మాలే'' అనగానే మరింక ఏమాత్రం ఆలస్యం చేయకుండా బామ్మను థియేటర్‌కి రిక్షాలో సాగనంపి తను వచ్చేశాడు.

ఆ సాయంత్రం ఆంజనేయులు ఆఫీసు నుండి వచ్చేసరికి మహదేవమ్మ పెద్ద గొంతెట్టుకుని అరుస్తున్నది.

"తప్పంతా నా కొడుకుదేనని ఒప్పుకుంటున్నానుగా..వాడు నిన్ను 'ఆ సిన్మా'కి పంపటం శుద్ధ తప్పు. వెధవ వాడికసలు బుద్ధి లేదు. రానీ వాడి కాళ్ళిరగ్గొడతాను'' అని ఆమెను సముదాయించటానికి నానా తంటాలు పడుతున్నాడు ఆంజనేయులి తండ్రి అవతారమూర్తి.

తను బామ్మను ఆ భక్తి సిన్మాకి పంపటం ఘోరంలా మాట్లాడుతుంటే మండిపోయింది ఆంజనేయులికి. సుడిగాలిలా లోపలికి దూసుకెళ్ళాడు.

"అసలు నా తప్పేంటట..? పాత భక్తి సిన్మా అని చెప్పి బామ్మను పంపించా..అదీ తప్పేనా?'' అంటూ ఆంజనేయులు సునామీలా దూసుకు పోతుంటే-అతని మీద మహంకాళిలా విరుచుకుపడిపోయింది మహాదేవమ్మ.

"వెధవన్నర వెధవా...అంజిగా..నీకేం పోయే కాలంరా..మతీ సుతీ లేవట్రా! కాటికి కాళ్ళు చాచుకున్న నాకు సతీసక్కుబాయంటూ చెప్పి మోసం చేస్తావా?..అందులో ఎవతకయినా పైటలున్నాయట్రా..బరితెగించిన ఆ మగ వెధవల్తో ఆ పిచ్చి గంతు లేంట్రా..నాకు చీదరేసి బయటకెళ్ళిపోతానన్నాసరే. ఆ గేటు కావలావాడు నన్ను అడ్డేసి లోపల కుదేసాడ్రా...! ఎంత పాపం మూటగట్టావురా నాకు'' అని లబోదిబో మన్నది. పెరట్లోకి వెళ్ళి పది బకెట్ల నీళ్ళతో స్నానం చేసింది. ఆంజనేయులకి బాగా మండింది.

ఇటీవలి కాలంలో బయట ఒక సినిమా బోర్డు..లోపల మరేదో చూపిస్తున్నారని...అది కేవలం రాజధానికే పరిమితం అని అనుకున్నాడు. తన ఊళ్ళో కూడా ఇటువంటి బాగోతం జరుగుతుందనుకోలేదు. తన వెర్రికోపం అంతా థియేటర్ వాళ్ళ మీద చూపించాడు ఆంజనేయులు. అయినా సరే అవేవీ లక్ష్యపెట్టని మేనేజర్ నవ్వుతూ- "అయ్యా! మీకు ఫ్రీగా చూపిస్తామంటే ఆ బామ్మగారిని పంపారెందుకు సార్! మా థియేటర్‌కి మీలాంటివాళ్ళు మరోసారి రావాలనేకదా ఇలాటి మసాలా సినిమాలు చూపించేది'' అన్నాడు.

దిమ్మ తిరిగిపోయింది ఆంజనేయులకి.

ఇలా ఉండగా హఠాత్తుగా ఆంజనేయులు పనిచేస్తున్న ఆఫీసు ఇన్‌స్పెక్షన్ చేయడానికి ఆఫీసర్లు దిగుతున్నారని తెలిసింది. దాంతో నానా హడావుడి మొదలెట్టాడు బాస్ కనకరత్నం.

రికార్డు వర్కంతా సవ్యంగా చేసుకోమని, వచ్చేవాళ్ళు తిక్క శంకరయ్యలనీ..ఏమాత్రం అవకతవకలు జరిగినా సరే స్పాట్‌లో డిస్మిస్ చేయటం ఖాయమని బెదరగొట్టాడు.

అంతేగాక ఆ వస్తున్న ఆఫీసర్స్‌కి 'సకల' ఏర్పాటు చేయమని, అందులో ఎటువంటి లోటుపాట్లు జరగకూడదని, అలాకాకుండా ఏమాత్రం తప్పిదం జరిగినా..ఫైల్స్‌లో కొర్రీలు వేయటం తప్పదని హెచ్చరించాడు కనకరత్నం.

ఆ సందర్భంగా ఒక్కొక్కరికీ ఒక్కో బాధ్యత అప్పగించాడు. ఆంజనేయులి వంతు వచ్చేసరికి

మాత్రం, భోజనాల ఏర్పాట్లు చూడాలని ప్రత్యేకించి మరీ చెప్పాడు కనకరత్నం. అలా అతను అప్పగించటం వెనుక బలమైన కారణమే ఉన్నది. ఆంజనేయులు అడపాదడపా తను ఇంటి దగ్గర్నుంచి తెచ్చుకున్న వేడి వేడి పదార్థాలు కనకరత్నంకి కూడా వడ్డిస్తుండేవాడు. ఆ రుచులు మరిగిన అతడు ఆంజనేయులి మీద అపార నమ్మకంతో ఆ బాధ్యత మోపాడు.

దానికి ఎగిరి గంతేసిన ఆంజనేయులు- 'ఓహ్! ఆ వచ్చే వాళ్ళని నవకాయ పిండివంటల్తో ముంచి పారేస్తాను. ఈ దెబ్బతో నాకు ప్రమోషన్ ఖాయం' అనుకుని తెగ ఉబ్బిపోయాడు.

భాగ్యనగరం నుండి ఆఫీసర్లు దిగబడ్డారు.

అంతుదయాన్నే ఇంట్లో టిఫిన్ చేయమంటే తల్లి జగదాంబ చిర్రుబుర్రులాడుతుందని చెప్పి తాత్కాలికంగా ఓ హోటల్ నుండి టిఫిన్స్ మోసుకెళ్ళి వారికి అందించాడు ఆంజనేయులు.

'తిండికి మొహం వాచినట్లున్నారు. కాకా హోటల్లో టిఫిన్‌కే ఇంతలా లొట్టలువేస్తున్నారంటే తను ఇంటి దగ్గర్నుంచి తెచ్చే భోజనాన్ని మరెంతగా జుర్రుతారో' అని తనలో తను అనుకుంటూ కనకరత్నంను కలిశాడు ఆంజనేయులు.


"వాళ్ళు పూర్తిగా నాన్‌వెజ్.. వారికి ఎలాంటి భోజనం అందిస్తావో మరి..అదిరిపోవాలి.." అన్నాడు. అంతే ఆంజనేయులికి విజయనగరంలో కోళ్ళ బజారు గుర్తుకొచ్చేసింది. నాణ్యమైన కోళ్ళకి అక్కడ ప్రసిద్ధి.

అప్పుడే కార్తీకమాసం ముగియటంతో కోళ్ళ ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. బేరం ఒకంతట కుదరటం లేదు. అదే సమయంలో-

"అయ్యా! రెండుకోళ్ళు కొంటే ఒక కోడి ఫ్రీ.." అన్న అరుపు ఆంజనేయులి చెవులకి అమృతంలా సోకింది.

దాంతో మరి ముందు వెనుకలు ఆలోచించకుండా కొనేశాడు. నిజానికి ఈ భోజనాల ఖర్చులన్నీ ఆఫీసరు ఎలాగూ పెట్టుకోడు. తన నెత్తికే చుట్టుకుంటాయి. అందుకనే సూక్ష్మంలో మోక్షం మార్గం ఎంచుకున్నాడు. మసాలా సామాన్లు కూడా 'ఫ్రీ' వచ్చిన వాటికే ప్రాధాన్యత ఇచ్చాడు.

ఇంటికి చేరంగానే పనివాడు నర్సిగాడికి కోళ్ళ సంహార బాధ్యత అప్పగించాడు. ఆనక తల్లి జగదాంబ చేత వండించాడు. ఆ వాసన మాత్రం



అమోఘంగా ముక్కుపుటాలని అదరగొట్టేసింది. ఆ వంటకాలన్నీ ఆఫీసర్ల దగ్గరకు చేర్చాడు. అప్పటికే నకనకలాడుతున్న ఆఫీసర్లకి ఆంజనేయులి రాకతో పన్నీరు చిలకరించినట్లైంది. వాసన చూస్తుంటే నోట్లో నీళ్ళూరసాగాయి. వాళ్ళందరికీ ఆకుల్లో సర్దేసి తను బయట కెళ్ళిపోయాడు ఆంజనేయులు. ఒక గంట తర్వాత ఆంజనేయులికి కబురు వచ్చింది. అప్పటికే కనకరత్నం వారి ముందర హాజరయి ఉన్నాడు. "ఇదిగో! ఆంజనేయులూ! ఇటువంటి డిషెస్ ఇంతదాకా ఏనాడూ ఎరగమయ్యా! ఆహా! ఏమి రుచి..ఏమి రుచి.." అని ఒకటే పొగిడాడో ఆఫీసర్.

"నలభీమపాకం అని పురాణాల్లో చదివాం కాని...ఈనాడు నీ వంటకాల వల్ల అది స్వయంగా తెలుసుకోగలిగాం" మరో ఆఫీసరు.

ఆంజనేయులి మొహం చింకిచాటకు మారు పేరయింది.అయితే అదే సాయంత్రం ఆంజనేయులి ఫైల్స్‌మీద పడ్డారు ఆఫీసర్లు. ప్రతి అంగుళం వెతికి వెతికి మరీ అన్నీ శోధించారు. లాక్కుంటూ, పీక్కుంటూ వెళ్ళటం వల్ల నాన్పుడు ఎక్కువయింది.

బుర్రగోక్కోవటం మినహా ఏమీ చెయ్యలేకపోయాడు ఆంజనేయులు. ఆఫీసర్లు తన విషయంలో చాలా సరళంగా వ్యవహరిస్తారనుకున్నాడు. కానీ ఎందుకిలా జాగిలాల్లా వెంటాడుతున్నారో బోధపడి చావలేదు.

"నువ్వు వండి తెచ్చిన వంటకాల్లాగే ఉన్నాయోయ్ నీ ఫైల్స్ కూడా" అని ఆఫీసర్లు అన్నా..ఇంకా మీమాంసే.

ఆ రాత్రి భోజనాల ఏర్పాట్లు తనకి పురమాయించక పోవటంతో అనుమానం పెనుభూతంలా మారింది.

మరి ఉండబట్టక ఆంజనేయులు ఆఫీసరు దగ్గరికి వెళ్ళి అడిగేశాడు.

"చాలా బాగుందయ్యా ఆంజనేయులూ! వాళ్ళకి ఏం విషం తినిపించావోగానీ నీ ఫైల్స్ నిండా కొర్రీలే. దీంతో నీకు రెండింక్రిమెంట్లు కట్ చేసి పారేశాడు. ఇదివర్లో నీ పదార్థాలకి నేనే లొట్టలేసే వాడిని. అటువంటిది అందులో ఏ ఒక్కరికీ నువ్వు వండి తెచ్చినవి నచ్చలేదంటే అర్థం..ఏమయిందయ్యా! ఎవరు వండారసలు..? పైగా చచ్చిన కోళ్ళుగాని వండలేదుకదాని నామీద అంతెత్తున ఎగిరిపోయాడాయన." అన్నాడు ఆఫీసరు కనకరత్నం అగ్గెత్తిపోతూ. మ్రాన్పడిపోయాడు ఆంజనేయులు. తప్పెక్కడ జరిగిందోనని కిందా మీదా ఆలోచించాడు. అప్పుడు అర్థమైపోయింది.

అందుకే ఆరోజు నర్సిగాడు "ఈట్ని సంపేదేటి బాబూ? సగం చచ్చే ఉన్నాయి" అని అంటున్నా తను పట్టించుకోలేదు.

మసాలా దినుసుల విషయంలో కూడా అలాగే జరిగి ఉంటుంది. అంటే ఆరోజు కోళ్ళ బజారులో తనకు అంటగట్టినవి? మరి ఆలోచించలేకపోయాడు. కళ్ళు గిర్రున తిరిగాయి ఆంజనేయులికి.

★★★

చింత చచ్చినా పులుపు చావదంటారు. పుర్రెతో పుట్టిన బుద్ధి పుడకలతోగాని పోదంటారు. వీటికి ప్రతిరూపం ఆంజనేయులు. నిన్నగాక మొన్న బొప్పికట్టిన దాన్లోంచి ఇంకా తేరుకోకముందే మళ్ళా మరో ప్రహసనం ప్రారంభమైంది. "ఏమిటీ? బంగారం గొలుసు ఒకటి కొంటే మరొకటి ఫ్రీగా ఇస్తున్నారా!" అన్నాడు ఆనందాశ్చర్యాలతో ఉబ్బితబ్బిబ్బవుతూ..

"ఔను గురూ! చాలామందిమి కొనుక్కున్నాం. జనం విరగబడుతున్నారనుకో.." అని వర్ణించి మరీ చెప్పాడు కొలీగ్ ఎర్రం నాయుడు.

"నకిలీదేమో!" సంశయంగా అన్నాడు ఆంజనేయులు.

"నీలాగే నేనూ భయపడ్డా..కానీ గీటు పెట్టించా..పూర్తి గ్యారంటీ"

అసలు ఎవరి మాటలకి బుట్టలోపడని వ్యక్తి ఎర్రంనాయుడు... మరి అటువంటివాడే కొన్నాడంటే...!? ఆంజనేయులు వెంటనే బ్యాంకుకు వెళ్ళి డబ్బులు డ్రా చేసి మరీ షాపుకి పరిగెత్తాడు. 'పసిడి ప్రభ' జ్యూయలర్స్ వారు ఆంజనేయులి అత్యుత్సాహం కనిపెట్టి, "మీరు తప్పకుండా ఇష్టపడతారు. ఒకవేళ మీరు ఈ నగల మీద అనుమానపడితే ఎదురుగా వున్న షాపుల్లో గీటు పెట్టించుకుని వచ్చాక కొనండి" అని వస్తువును ఇచ్చాడు.

ఎదురుషాపువాళ్ళు ఆంజనేయులు తెచ్చిన గొలుసును గీటు పెట్టి ఢోకాలేదంటూ బల్ల గుద్ది మరీ చెప్పారు. తర్వాత రెండొందలు పిండారు.

మరో ఆలోచన చేయకుండా కొనేశాడు ఆంజనేయులు.


ఇది జరిగిన రెండోరోజే గగ్గోలయింది. నకిలీ సరుకులు అంటగట్టి అందరికీ కుచ్చుటోపీ పెట్టి పలాయనం చిత్తగించారని, గీటుపెట్టిన వాళ్ళు కూడా వాళ్ళ వాళ్ళేనని పేపర్లు దుమ్మెత్తిపోసాయి.

ఆంజనేయులి నెత్తిన కొంగే మిగిలింది. బామ్మతోపాటు ఇంటిల్లిపాదీ తిట్లదండకంతో దండెత్తారు. ఇన్ని జరిగినా సరే ఆంజనేయులి వైఖరిలో ఎటువంటి మార్పురాలేదు. పైగా అతని పిచ్చి వెర్రితలలు వేసింది.



## పెళ్ళికూతురవుతున్న మీరా?

ప్రముఖ మాండలిన్ విద్వాంసుడు శ్రీనివాస్ సోదరుడు రాజేష్‌తో మీరా జాస్మిన్ సాన్నిహిత్యం గురించి కొంత కాలంగా వార్తలు జోరుగా వినిపిస్తున్నాయి. ఈ సంగతి గురించి ఇప్పటిదాకా మౌనంగా వుంటూ వచ్చిన మీరా ఇటీవల ఓ కార్యక్రమం సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ సూచనప్రాయంగా రాజేష్‌తో తన దోస్తీ గురించి ప్రస్తావించింది. అతనితో పరిచయం తనకెంతో సంతోషాన్ని కలిగిస్తోందనీ, త్వరలోనే తమ పెళ్లి జరగవచ్చుని అంటోంది మీరా జాస్మిన్.



ప్రతీ షాపుకి వెళ్ళటం..ఫ్రిజ్ కొంటే ఫ్రిజ్ ఫ్రీగా యిస్తారా..? టీ.వి.కొంటే టీ.వి.ఫ్రీగా యిస్తారా..లుంగీ కొంటే లుంగీ ఫ్రీగా ఇస్తారా! అంటూ పదే పదే అడగసాగాడు. నిజానికి కొన్ని వస్తువులకి ఎటువంటి ఆఫర్లు లేకపోయినా సరే ఆంజనేయులి పిచ్చి నెరిగిన కొందరు ఏవేవో చెప్పి అతన్ని మరింత పిచ్చెత్తించి మరీ వినోదిస్తున్నారు. ఇలా శృతిమించి రాగాన పడుతున్న ఆంజనేయులి 'ఫ్రీ'ల పిచ్చితో ఇంటిల్లిపాదికే కాక, ఆఫీసు యాజమాన్యా నికి మతిపోయింది. తను బజారులో ఫ్రీలుగా సంపాయించిన వాటిని అంద రికీ చూపిస్తూ తెగ మురిసిపోసాగాడు. అంతేకాదు ఇల్లంతా లేనిపోని వస్తు వులతో పేరుకుపోయింది. ఇదంతా చూస్తున్న మహదేవమ్మ ఆంజనేయులి పిచ్చి తగ్గడానికి ప్రత్నామ్నాయం ఆలోచించింది.

పెళ్ళి కుదిరితేగాని పిచ్చి కుదరదని. పిచ్చి కుదిరితేగాని పెళ్ళి కుదర దని సామెత. నిజానికి ఆంజనేయులి ముదిరిన ఈ పిచ్చికి పెళ్ళే అసలు సిసలు మందని మహదేవమ్మ ఆలోచన.

" ఈ పిచ్చి తగ్గాలంటే మాత్రం పెళ్ళే మందు'' అంది మహదేవమ్మ.

"కానీ ఈ ముదర బెండకాయ మొగ్గద్దూ!'' సందేహం వెలిబుచ్చాడు అవతారమూర్తి.

"ఎందుకు మొగ్గడూ! ముందో పిల్లను వెతికిపెట్టు'' అందామె.

***

"ఔన్రా! అబ్బే! నేచెప్పింది నీకు నమ్మకంగా లేదా! మేం నీ పిచ్చికి తగ్గట్టే ఒప్పందం చేస్తున్నాం. అయితే చిన్న షరతు'' అన్నది బామ్మ.

ఏమిటన్నట్లుగా దిగ్భ్రాంతి వ్యక్తం చేశాడు ఆంజనేయులు.

"మరేం లేదు. నువ్వు మొదట ఓ అమ్మాయిని చేసుకోవటానికి ఒప్పు కుంటే నీకు వాళ్ళ చెల్లిని కూడా ఫ్రీగా..'' అని ముసి ముసిగా నవ్వింది.

ఆంజనేయులు తన్మయంతో బుర్రూపిన మరుక్షణం పెళ్ళి చూపులకు లాక్కెళ్ళారు. పెళ్ళి చూపుల్లో "ఒరే బడుద్దాయీ! అటు చూడ్రా! నీ కాబోయే...'' అంది బామ్మ మహదేవమ్మ. అటు చూసి చూడగానే బుర్ర గిర్రున తిరిగిపోయింది. "బామ్మా!'' ఒక్క అరుపు అరిచాడు కంగారుగా.

"ఒరే అలా కంగారుపడిపోకురా! అసలు కంటే వడ్డీ ముద్దంటారు కదా..అలాగే నీకూనూ. చూడు తలుపు చాటునుండి చూస్తుందే...ఆ మెరుపు తీగనే నీకు ఫ్రీగా..'' జనాంతికంగా అన్నది బామ్మ.

ఆ తలుపుచాటు సుందరిని చూసి తెగ ముచ్చట పడిపోయి పెళ్ళికి తలొంచేసాడు ఆంజనేయులు. పదిరోజుల్లో ఆంజనేయులి పెళ్ళి జరిగిపో యింది. పడగ్గదిలో తన శ్రీమతి సరసన ఉన్నాడన్న మాటేగాని మనసంతా మరదలు పైనే ఉన్నది. "మరి..మరి..మన పెళ్ళయిన మరుక్షణం మీ చెల్లిని కూడా నాకు యిస్తారని..'' ధైర్యం చేసి అడిగాడు ఆంజనేయులు.

"ఏమిటీ కూసారూ? నేను కాకుండా మా చెల్లి మీక్కావలసి వచ్చిందా..మిమ్మల్ని'' కళ్ళెర్ర చేసింది శ్రీమతి.

"అలా అని బామ్మ చెప్పబట్టే నిన్ను'' అనేశాడు.

"మరోసారి ఆమాట మీ నోటి నుంచి వచ్చిందో నా తడాఖా చూపిస్తా''

***

ఆ మర్నాడు "బామ్మా! ఏమిటిలాగయింది...'' బామ్మపై విరుచుకుప డ్డాడు ఆంజనేయులు.

"ప్రతీదానికి ఫ్రీ అంటూ పిచ్చెత్తిపోయే నీమీద అదే అస్త్రం ప్రయోగించి మూడుముళ్ళేయించాం..నీ తిక్క కుదర్చాలనే ఈ పనిచేశా..మరోసారి మర దలి ఊసెత్తద్దు. ఎత్తితే తన్నగలదు మీ ఆవిడ'' అంది బామ్మ.

"అంటే జీవితాంతం..ఈ దెయ్యంతోనా కాపురం...'' బిక్కచచ్చిపో యాడు ఆంజనేయులు.

"నో అలా వద్దు'' గట్టిగా అరిచాడు ఆంజనేయులు. భయంకరమైన ఆ కల ఆంజనేయులిని కుదిపేసింది. తనింతకాలం 'ఫ్రీ'ల పేరుతోనే అవసరం లేని వాటిని కూడా మోసుకొస్తున్నాడు. ఇదే వైఖరి వివాహం విషయంలో కూడా ప్రదర్శిస్తే ఎలా ఉంటుందో ఊహామాత్రంగా ఆలోచించాడు. అంతే, అదే కలగా అవతరించి తనను భయపెట్టింది. నిజానికి పెద్దలు చెప్పినట్లు బుద్ధిగా వ్యవహరించకపోతే..ఈ 'ఫ్రీ'ల పిచ్చిలో పడి పెళ్ళి విషయంలో కూడా కోరి కష్టాలను కొని తెచ్చుకున్నట్లే ఔతుంది. ఇలా ఆలోచించిన ఆంజనేయులు పెళ్ళి విషయంలో ఎటువంటి పంతాలకు పట్టింపులకు మాత్రమే కాదు, ఫ్రీల జోలికి కూడా పోలేదు. ఓ శుభముహూర్తాన సలక్షణ మైన అమ్మాయిని కట్టుకున్నాడు కానీ కట్నం కోరకుండా 'ఫ్రీ'గానే...!

★

## ఇతర గ్రహాల్లోనూ నీళ్ళున్నాయి

1999లో భూగర్భ శాస్త్రజ్ఞులకి దొరికిన గ్రహ శకలాన్ని పరిశోధిస్తే అది 450 కోట్ల ఏళ్ళనాటిదని దాంట్లో నీళ్ళు కూడా సంక్షిప్తమై ఉన్నాయని తెల్సి ఆశ్చర్యానందాలకి లోనయ్యారుట! ఇంతకాలం ఇతర గ్రహాలలో నీళ్ళున్నాయే లేదో అన్న అనుమానం వారికిప్పుడు తీరిపోయిందిట!

## యజమానిని కాపాడిన కుక్క

ఇండియానాలో క్రిస్టఫర్ పీబిల్స్ అనే 13 ఏళ్ళ కుర్రాడు చలిబాధకి తట్టుకోలేక తన ఫ్రెండ్సుతో కల్సి రాత్రి ఇంటి బేస్‌మెంట్లో పడుకున్నాడట! కాళ్ళదగ్గరే పడుకున్న అతని పెంపుడు కుక్క లాబ్రడార్ ఎప్పుడూ లేనిది అతని పాదాల్ని పట్టుకొని కొరక సాగిందిట. అది ఏ బాత్రూముకో వెళ్ళాల్సి వచ్చి అలా పీకుతోందనుకుని అతను దాన్ని తీసుకుని పైకి వచ్చి చూస్తే ఇంకేముంది? ఇల్లు తగలబడిపోతూ కనిపించిందిట. అదే కనుక తనను లేపి వుండకపోతే ఆ అగ్నిప్రమాదంలో చచ్చిపోయి వుండేవాళ్ళ మని ఫైర్ సర్వీసు వాళ్ళతో ఆ కుర్రాడు చెప్పాడు.

## సీతాకోక చిలుక రహస్యం

సీతాకోక చిలుక రెక్కలు రంగు రంగులుగా ఉంటుందని అంతా అను కుంటాము. కానీ, అది నిజం కాదు. పారదర్శకమైన దాని రెక్కల మీద పడిన కాంతి వక్రీభవనం చెంది మనకలా రంగు రంగులుగా కనిపిస్తుంది!

-విమలారామం

